నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

మద్యపానం నిషేధిస్తూ తీర్మానం

- గుట్టుగా విక్రయిస్తే లక్ష జరిమానా

నవతెలంగాణ-లింగంపేట్


సమావేశమైన గ్రామస్తులు

గ్రామంలో మద్యం విక్రయించినట్లయితే లక్ష రూపాయల జరిమానా వేస్తామని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.బుధవారం లింగంపేట మండలంలోని సజ్జన పల్లి గ్రామంలో గ్రామస్తులు కుల సంఘాల పెద్దలు గ్రామ పెద్దలు యువజన సంఘాల సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మద్యం అమ్మారాదని మద్యానికి బానిసై అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మద్యానికి బానిస అప్పుల పాలై కుటుంబాలు చాలా ఉన్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలను పునవృతం కాకుండా గ్రామస్తులు ఏకమై గ్రామంలో మద్య విక్రయించరాదని విక్రయించిన నట్లయితే వారికి లక్ష రూపాయల జరిమానా విధిస్తామని గ్రామస్తులు తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ఎల్లారెడ్డి ఎక్సైజ్ శాఖ, లింగంపేట్ పోలీస్ శాఖ అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ డీఎస్పీ

- ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన గంగాధర్

నవతెలంగాణ-ఆర్మూర్/కంఠేశ్వర్



ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎం. గంగాధర్ (ఆర్మూర్) బుధవారం ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటించారు. ఇటీవల డీఎస్పీ పదవికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీనియర్ కాంగ్రెస్ నేత వి.హన్మంతరావుతో పాటు సెక్రటేరియట్ కు వచ్చిన గంగాధర్ కు మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికార అభ్యర్థి డా. వి. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాల్సిందిగా మంత్రి ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానుకూల బడ్జెట్ తేవాలి

- ప్రజలను చైతన్యవంతం చేసేలా 16 నుంచి 25వ తేదీ వరకు బడ్జెట్ కేటాయింపులపై సదస్సులు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

కేంద్ర బడ్జెట్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులను కేటాయించాలనే డిమాండ్‌తో.. కేటాయింపులపై ఈ నెల 16 నుండి 25 వరకు సదస్సులు సమావేశాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) నిర్ణయించినట్టు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో పేద మధ్యతరగతి ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే విధంగా నిధులను కేటాయించలేదని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను నిర్వహించే పేదలకు వ్యవసాయ కూలీలకు లక్షల కోట్లు కేటాయిస్తే తప్ప తగినంత ఉపాధి హామీ పనులు లభించవని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలను అమలు జరపటానికి నిధులను కేటాయించలేదని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు నిధుల కేటాయింపు జరగలేదని రైతాంగాన్ని ఆదుకునే పద్ధతుల్లో గిట్టుబాటు ధరకు నిర్ణయం చేయలేదని జిల్లాకు కేటాయించిన పసుపు బోర్డు ఏర్పాటుకు సంబంధించిన నిధులను కేటాయింపు జరపలేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో సవరణలు చేయాలని అందుకు కేంద్ర మంత్రులుగా ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన కిషన్ రెడ్డి, బండి సంజయ్, ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని అందుకొరకు ప్రజలను చైతన్యవంతం చేయటానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సులు, చర్చ పోస్టులు సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి చేరవేయనున్నట్టు తెలిపారు.

పెట్టుబడిదారుల అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజానుకూల బడ్జెట్ కోసం ప్రయత్నం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఈనెల 16 నుండి 25వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో సదస్సులు చర్చాగోష్టులు సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, నన్నే సబ్, ప్రజానాట్యమండలి నాయకులు సిర్పలింగం తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టివ్వండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్
- గతంలో పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు పరిశీలించిన నాయకులు

నవతెలంగాణ-గాంధారి


పేదలకు అందజేసిన ఇండ్ల స్థలాలను పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో 2008లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను బుధవారం పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లా డుతూ 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 108 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. లేఅవుట్ చేసి పంపిణీ సైతం చేశారని, కానీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అక్కడ ఇల్లు కట్టి ఇవ్వలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం వీరికి డబల్ బెడ్ రూమ్ ఇస్తామని చెప్పి కట్టించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అక్కడ రోడ్లు , మంచినీళ్ల, విద్యుత్ వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి పెద్దఎత్తున పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు మోతిరామ్ నాయక్, వెంకట్ గౌడ్, కొత్త నర్సింలు, మండల నాయకులు సరాబ్ కిషన్ రావు, మధు, పత్తి విఠల్ పాల్గొన్నారు.

మగ్గం వర్క్, బ్యూటీపార్లర్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


బ్యూటీషియన్‌లో శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు

మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ కు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీవో మహేశ్వర్ కోలేటి సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారు ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. ప్రస్తుతం ఉచితంగా కొనసాగుత్ను మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ బ్యాచ్ విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉచితంగా శిక్షణ నేర్పిస్తున్నారని, అన్ని వసతులు బాగా ఉన్నాయని, ఇలాంటి శిక్షణ పొందుతు స్వయం ఉపాధి తో కుటుంబానికి అండగా ఉంటుందని వివరించారు. ప్రస్తుత కాలం లో మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ కి మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని అందరు స్వతంగా దుకాణాలను పెట్టుకోవాలని, అవసరం ఉన్న వారిందరికి ఎస్ బి ఐ బ్యాంక్ సహాయం చేస్తుందని చెప్పారు. బ్యూటీపార్లర్ విద్యార్థులు వివిధ రకాల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, ఈశ్వరి, సుజాత, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ హాట్‌స్పాట్‌లు గుర్తించాలి

- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి


ప్రమాదాల నివారణకు సూచనలిస్తున్న అనన్యరెడ్డి

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గత సంవత్సరం నుండి ఇప్పటివరకు జరిగిన రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను బుధవారం జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పరిశీలించారు. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. దీని విషయమై కామారెడ్డి అదనపు ఎస్పీ బీ చైతన్య రెడ్డి కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి రాజు లకు తగు సూచనలు, సలహాలను అందజేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగుచున్న హాట్‌స్పాట్ లను గుర్తించి వాటిని నివారించుటకై తగు సూచనలు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన కాలనీవాసులు

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమాస్తా కాలనీ యందు కాలనీవాసులతో , వ్యాపార వ్యక్తులతో కమ్యూనిటీతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించి సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను, నేరాలు అదుపులో ఉండడానికి చేయవలసిన పనులను వివరంగా ఎస్సై రాజు కాలనీవాసులకు వివరించారు. సీసీ కెమెరాలు ఆవశ్యకతను తెలుసుకున్న కాలనీవాసులు, వ్యాపారస్తులు ఉత్సాహంతో ముందుకు వచ్చి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుకై లక్ష రూపాయలను అందజేసినట్టు తెలిపారు. వారి చొరవను ఏఎస్పి చైతన్య రెడ్డి అభినందించారు. దేవునిపల్లి పిఎస్ పరిధిలోని మిగతా గ్రామాల్లో ప్రజలు, వార్డు ప్రజలు తమ తమ కాలనీ క్షేమం కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ముందుకు రావాలని ఎస్సై ప్రజలను కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మచారెడ్డి : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేయాలని, ఎ ఎస్పి చైతన్య రెడ్డి అన్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని రోడ్డు ప్రమాదాల స్థలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని, రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాలను గుర్తించి సుచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

15న రక్తదాన శిబిరం

- ప్రతి రక్తదాతకు హెల్మెట్ బహుకరణ

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న బాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 15 వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి రక్తదాన శిబిరాన్ని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఆర్కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసారి 500ల యూనిట్ల రక్తాన్ని సేకరించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు హెల్మెట్ తో పాటు ప్రశంస పత్రాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. ఇతరాత్రి వివరాలకు 9492874006కు సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, సభ్యులు అంజల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌ల గొంతుకగా పనిచేస్తా

- ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తా
- డబ్బుసంచులతో వస్తున్న వారిని నిలువరిద్దాం
- టీపీటీఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

టీచర్ ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుండి రిటైర్డ్ అయ్యేంత వరకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేశానని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా గెలిపిస్తే టీచర్ల గొంతుకగా పనిచేస్తా అని టీపీటీఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో వై అశోక్ కుమార్ కు మద్దతిస్తున్న భాగస్వామ్య సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ స్వప్రయోజనాల కోసం డబ్బుసంచులతో వస్తున్నారని, వారిని నిలువరిద్దామన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. తన జీవితమంతా కూడా మొత్తం విద్యారంగంతోనే పెనవేసుకున్నట్టు తెలిపారు.

ఇప్పుడు ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రభుత్వం వాగ్దానం చేసినటువంటి 15 శాతం నిధులు కేటాయించడానికి నిలబడతానని చెప్పి హామీఇస్తున్నట్టు తెలిపారు. పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్ ఆరోపించారు. ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీ లు గా ఎన్నుకున్నట్లయితే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డా. సూరి, జేఏసీ కన్వీనర్ భాస్కర్ , టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ళ సురేష్, ప్రధాన కార్యదర్శి పూదారి అరవింద్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోషన్న టిపిటిఎఫ్ నాయకులు సత్యనారాయణ, గోపి,నగేష్ అలీం, చంద్రశేఖర్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఓటుకే 'ప్రాధాన్యం'

- ప్రత్యేక పరిస్థితుల్లో 2వ, 3వ ఓట్లు సైతం కీలకం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'ఓటు రూటు సెపరేట్'
- ఓటు వేయడం నుంచి కౌంటింగ్ వరకు ప్రత్యేకం

నవతెలంగాణ-కంఠేశ్వర్



జనరల్ ఎలక్షన్‌తో పోలిస్తే గ్రాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఓటింగ్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. ఓటు వేసేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అది చెల్లకుండా పోయే అవకాశం ఉంది. ఈసారి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్‌ల స్వీకరణ ముగిసింది. స్క్రూట్నీ సైతం పూర్తయింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100 నామినేషన్‌లు రాగా, 32 మందివి తిరస్కరణకు గురైయ్యాయి. 68 మంది నామినేషన్‌లు ఆమోదం పొందాయి. అదే విధంగా ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 17 మంది నామినేషన్‌లు వేయగా.. ఒకరిది తిరస్కరణకు గురికాగా 16 మందివి ఆమోదం పొందాయి. నామినేషన్‌ల విత్‌డ్రాకు నేటితో చివరి తేదీ. నేటితో ఎంత మంది బరిలో నిలుస్తారో తెలియనుంది.

1,2,3,4 ప్రాధాన్యత క్రమంలో ఓట్లు

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, జిల్లాల్లో కలిపి సుమారుగా 3 లక్షల 41 వేలకు పైగా మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. అయితే.. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక మిగతా ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ఓటర్ల ఎంపిక, పోలింగ్ విధానంతో పాటు ఓట్లు వేసే పద్ధతి కూడా విభిన్నంగా ఉంటుంది. పోలింగ్ రోజున ఓటు వేయటం ఓటర్లకు పెద్ద టాస్క్ పోలింగ్ బూతులోకి వెళ్లగానే.. అధికారి మనకు ఓ బ్యాలెట్ పేపర్, పెన్ను ఇస్తారు. ఆ పెన్నుతో మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుంది. సొంతంగా తీసుకెళ్లిన పెన్నుతోనో, స్కెచ్‌తోనో వేస్తానంటే కుదరదు. అలా వేసినా ఆ ఓటు చెల్లకుండా పోతుంది. ఇక పదుల సంఖ్యలో ఉండే అభ్యర్థుల పేర్లతో న్యూస్ పేపర్ను తలపించేలా బ్యాలెట్ పేపర్ ఉంటుంది. అందులో కేవలం అభ్యర్థుల పేర్లు ఉండగా ఆ పేర్లకు ముందు ఓ బాక్స్ ముద్రించి ఉంటుంది. అయితే సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరో ఒక్క అభ్యర్థికి మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకరి కంటే ఎక్కువ మందికి ఓటెస్తే అది కాస్త చెల్లకుండా పోతుంది. కానీ ఇక్కడ మాత్రం వాటికి పూర్తి భిన్నం. ఒక ఓటరు ఎంత మందికైనా ఓటు వేసుకోవచ్చు.. 1,2,3,4 నలుగురికి ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసే అవకాశం ఉంది.

కౌంటింగ్ చేపట్టే విధానం..

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ పెద్ద ప్రహసనం. రెండు, మూడు రోజులు కౌంటింగ్ జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. కౌంటింగ్‌కు ఏజెంట్‌గా వెళ్లాలంటేనే కనీసం రెండు రోజులు గడుపుతామనే భావన ఉంటుంది. చెల్లిన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లు సగం కంటే ఎక్కువ వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు. అలా రాని పక్షంలో తొలి ప్రాధాన్యత ఓట్లు తక్కువగా వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. ఎలిమినేట్ అయిన అభ్యర్థి యొక్క రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరెవరికి ఎన్ని వచ్చాయో వారికి కలిపి మరోసారి సగం కంటే ఎవరికి ఎక్కువ వచ్చాయో లెక్కిస్తారు. అప్పుడు సైతం సరిపడా ఓట్లు రాకుంటే.. ఉన్న వారిలో తక్కువ వచ్చిన అభ్యర్థిని సైతం ఎలిమినేట్ చేసి మూడో ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు కలిపి లెక్కిస్తారు. ఇలా 2,3,4 ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ క్రమంలో అభ్యర్థులు తక్కువగా ఉండి సగం ఓట్ల కంటే ఎక్కువ రాకుంటే.. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి విజేతను నిర్ణయిస్తారు.

ఉదాహరణకు లక్ష ఓట్లు పోలైతే 50,001 తొలి ప్రాధాన్యత ఓట్లు ఎవరికొస్తాయో వారే గెలిచినట్లు ప్రకటిస్తారు. అలా రాకుండా మొదటి ప్రాధాన్యత ఓట్లు 'ఏ'అనే అభ్యర్థికి 46 వేలు, బీ అనే అభ్యర్థికి 34 వేలు ఓట్లు, సీ అనే అభ్యర్థికి 10వేల ఓట్లు వచ్చాయనుకోండి.. సగం కంటే ఎక్కువ రాలేదు కాబట్టి వీరిలో ఎవరినీ విజేతగా ప్రకటించరు. తొలి ప్రాధాన్యత ఓట్లలో తక్కువ వచ్చిన సీ అనే అభ్యర్థిని ఎలిమినేట్ చేసి, అతని ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికిచ్చారనే అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రెండో ప్రాధాన్యతలో 'ఏ' అనే అభ్యర్థికి 2 వేలు ఓట్లు, బీ అనే అభ్యర్థికి 18 వేలు ఓట్లు వచ్చాయనుకోండి. మొత్తం 'ఏ'అనే అభ్యర్థికి 46,000, ప్లస్ 2,000 కాగా మొత్తం 48,000 ఓట్లు వచ్చినట్టు. అదే విధంగా బీ అనే అభ్యర్థికి 34,000 తో పాటు 18,000 కలపగా మొత్తం 52,000 వచ్చినట్టు లెక్క. దీంతో సగం కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన 'బీ' అనే అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. గెలుపులో రెండో, మూడో ప్రాధాన్యత ఓట్లు కూడా కీలకంగా ఉంటాయి.




ఓటు వేయు విధానం

- ఓటు వేయడానికి ఓటరు స్లిప్, ఎన్నికల సంఘం సూచించిన ఏదైనా ఒక ఓటరు గుర్తింపు పత్రం వెంట తీసుకువెళ్లాలి.
- పోలింగ్ అధికారి బ్యాలెట్ పేపర్, పెన్ను ఇస్తారు. వాటినే ఉపయోగించాలి.
- బ్యాలెట్ పత్రంలో పోటీలో ఉన్న అభ్యర్థుల పేరు, పార్టీ, పక్కన బాక్స్ ఉంటాయి.
- ఎన్నికల బరిలో ఎంతమంది ఉంటే అంతమంది పేర్లు ఉంటాయి.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతోనే 1,2,3,4 ఇలా ప్రాధాన్య క్రమంలో కేటాయించాలి.
- ఫస్ట్ ప్రయారిటీ ఓటు వేసి, ఇతర క్యాండిడేట్లకు ప్రాధాన్యత ఓటు వేయకున్నా ఏం కాదు. ఒకటి, రెండు ప్రయారిటీలు మూడోది ఇవ్వకున్నా పర్వాలేదు. ఎన్ని ప్రయారిటీ ఓట్లు వేసినా నంబరింగ్ మాత్రం వరుసగా ఉండాలి. '1', '2' ప్రయారిటీలు ఇచ్చి మూడోది ఇవ్వకుండా '4' ప్రయారిటీ ఇస్తే రెండో ప్రయారిటీ ఓటు వరకే కౌంట్ అవుతుంది. ఆ తర్వాత దాన్ని పక్కన పెడతారు.
- రోమన్ అంకెలు కానీ, ఒకటి, రెండు అని తెలుగులోనో.. వన్, టూ, త్రీ అని ఇంగ్లీషులోనో ఇవన్నీ కాదని టిక్ (రైట్ మార్క్) పెట్టటమో చేస్తే ఆ ఓటు కూడా చెల్లదు.
- ఒక ఓటరు ఒక్కరికే ఓటు వేయవచ్చు లేదా కొంత మందికి లేదా అందరికీ ఓటు వేయవచ్చు. అది మన ఇష్టం. ప్రాధాన్య క్రమాన్ని మాత్రం తప్పవద్దు.
- ఎన్నికల అధికారి సూచించిన దాని ప్రకారమే బ్యాలెట్ పేపర్‌ను జాగ్రత్తగా మడత పెట్టి బాక్సులో వేయాలి.
- ఫస్ట్ ప్రయారిటీ ఓటు (1) వేయకుంటే ఓటును రిజెక్ట్ చేస్తారు. 1 అంకె వేయకుండా 2, 3, 4 వేస్తే ఆ ఓటు చెల్లదు.
- ఒక క్యాండిడేట్‌కు ఇచ్చిన నంబర్ మరో క్యాండిడేట్కు ఇవ్వొద్దు. ఒకే నంబర్ ఇద్దరు, ముగ్గురికి వేస్తే ఆ ఓటు చెల్లదు.
- బాక్స్‌లో కేవలం నంబర్ మాత్రమే వేయాలి. టిక్, రౌండప్, సంతకం, వేలి ముద్ర, ఇంటూ మార్క్, పేర్లు, గీతలు, చుక్కలు రాయొద్దు. అంకెను అక్షరాల్లో రాయొద్దు. బ్యాలెట్పై ఏమైనా రాసినట్లు గుర్తిస్తే ఓటును రిజెక్ట్ చేస్తారు
- ఇక.. ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు ఓటరు తన వెంట.. ఓటర్ ఐటీ కార్డు లేదా.. ఆధార్ కార్డు, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటోతో కూడిన సర్వీస్ ఐడెంటిటీ కార్డ్, పాన్ కార్డు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలకు జారీచేసిన అధికార గుర్తింపు పత్రం, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లకు సంబంధిత విద్యా సంస్థలు జారీచేసిన గుర్తింపు కార్డు, యూనివర్సిటీలు జారీచేసిన డిగ్రీ, డిప్లొమా ఒరిజనల్ సర్టిఫికేట్లు, దివ్యాంగులకు జారీచేసిన అధికారిక గుర్తింపు కార్డు ఇలా ఏదో ఒకటి తీసుకెళ్లి.. బూత్‌లో ఉన్న పోలింగ్ అధికారికి చూపాలి.

స్థానిక ఎన్నికల్లో అతివలదే అగ్రస్థానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, నసురుల్లాబాద్ , బీర్కూర్, మండలాలు ఉండగా ఇందులో జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అందులో భాగంగా ప్రాదేశిక నియోజకవర్గాల ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలంలోనూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. ఇందులో బాన్సువాడ మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు గాను మగ ఓటర్లు 14197, మహిళా ఓటర్లు 15 వేల 429 ఓట్లు ఉండగా మొత్తం 29624 కోట్లు ఉన్నాయి, బీర్కూర్ మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలు గాను మగ ఓటర్లు 9540 మహిళా ఓటర్లు 1068 ఓట్ల గాను బీర్కూర్ లో 20,228 ఓట్లు ఉన్నాయి, నసురుల్లాబాద్ మండలం ఎనిమిది ఎంపిటిసి స్థానాలకు గాను మగ ఓటర్లు 99 మహిళా ఓటర్లు 11327, మొత్తం ఓట్లు 21 316 ఓట్లు ఉన్నాయి, దీనితో మూడు మండలాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండడంతో ఆశావాహుల భవితవ్యం మహిళల చేతుల్లోనే ఉందని పలు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓటరు జాబితాపై ఈనెల 13వరకు అభ్యంతరాలను స్వీకరించి 14న పరిష్కరిస్తారు.15వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ కనబరిచిన బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ పూర్వ విద్యార్థి



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో 2022-23 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి గటాడి సాయి కృష్ణ ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్‌లో 99.606 స్కోరు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రవికాంత్ బుధవారం తెలిపారు. పట్టణంలోని యోగేశ్వర కాలనీకి చెందిన గటాడి అశోక్, విద్యల కుమారుడు చిన్ననాటి నుండి చదువులో ముందుండేవాడని, ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో సాలూర చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధి పక్షులకు, కోళ్లకు సోకి అవి మృత్యువాత పడుతున్నాయి. దాంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులో భాగంగా ఇతర రాష్ట్రాల నుండి కోళ్ల రవాణా చేస్తున్న, గుడ్ల రవాణా చేస్తున్న వాహనాలు తెలంగాణలో ప్రవేశించకుండా సరిహద్దు ప్రాంతం వద్ద తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాలూర చెక్ పోస్ట్ వద్ద, కందకుర్తి చెక్ పోస్ట్ వద్ద అధికారులు పశుసంవర్ధక శాఖ సిబ్బందిని, పోలీసులను నియమించి వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వదులుతున్నారు. తనిఖీ కేంద్రం వద్ద పెంటాఖుర్దు వెటర్నరీ ఆసుపత్రి వీఎల్ఓ గొల్ల నారాయణ యాదవ్, పోలీసులు ఉన్నారు.

జెసిఐ ఇందూర్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జేసీఐ ఇందూర్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నగరంలోని సందీప్ గార్డెన్స్ లో అట్టహాసంగా జరిగింది. 2025 సంవత్సరానికి గాను జేసీఐ ఇందూర్ నూతన అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెందోటి గౌతమి ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేశారు. జేసీఐ ఇందూర్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని రజతోత్సవ వేడుకల్లో భాగంగా సంస్థ పూర్వాధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జేసిఐ ఇండియా 12వ జోన్ అధ్యక్షుడు వి.చతుర్వేది ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేసీఐ ఇందూర్ 25 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. జేసీఐని ముందుకు తీసుకెళ్తున్న పూర్వాధ్యక్షులను, సభ్యులను ఆయన అభినందించారు. జేసీఐ సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వీర్ సింగ్, జేసీఐ ఇండియా నేషనల్ డైరెక్టర్ బి.కిరణ్, జోన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.దిలీప్, జేసీఐ ఇందూర్ పూర్వాధ్యక్షులు జిల్కర్ విజయానంద్, వీరబ్రహ్మం, ఎం.శ్రీనివాస్, పద్మ శ్రీనివాస్, దండు గోవర్ధన్, కె.చంద్రశేఖర్, జుగల్ కిషోర్ సోని, పూర్ణచందర్, శ్రీహరి, యాదేష్, పి.చంద్రశేఖర్, మనోజ్ కుమార్, వెంకటరమణ గౌడ్, వి.శ్రీనివాస్ రెడ్డి, నయన్, గంగాదాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీపై బర్డ్‌ఫ్లూ వైరస్ దెబ్బ

- చికెన్ ప్రియులకు భారీ షాక్
- ఆందోళనలో పౌల్ట్రీ నిర్వాహకులు
- చికెన్ తినొద్దని రాష్ట్ర ప్రశుసంవర్ధకశాఖ ఉత్తర్వులు జారీ
- నాటుకోడి కూరకు డిమాండ్



నవతెలంగాణ-ఆర్మూర్

గత కొన్ని రోజుల నుండి ఉమ్మడి జిల్లాలోని బాయిలర్ కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడడంతో పౌల్ట్రీ నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. కాగా గత కొన్ని రోజుల పాటు చికెన్ తినవద్దని రాష్ట్ర పశు సంవర్తక శాఖ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్ద ఎత్తున కోళ్లు వైరస్ బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, మరోపక్క వివాహాది శుభకార్యాలలో సైతం చికెన్ ప్రియులు దూరం కావడం తీవ్ర నిరాశకు గురిచేస్తుంది.

అంతు చిక్కని వైరస్...

ఉమ్మడి జిల్లాల్లో బాయిలర్ కోళ్లకు అంత చిక్కని వ్యాధి వేగంగా వ్యాపించి భారీ సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ డివిజన్ లోని బోర్లం క్యాంపులో ఈ ఆదివారం సుమారుగా 2 వేల కోళ్లు వైరస్ బారిన పడి మృతి చెందాయి. తిరుమలాపూర్, బీర్కూర్ మండలంలోని కిస్టాపూర్, చించోలి గ్రామంలో 6 వేలకు పైగా కోళ్లు చనిపోగా జెసిబితో గుంతలు తీసి పూడ్చి వేశారు. గత కొన్ని రోజుల క్రితం జిల్లాలోని కమ్మర్‌పల్లి, భీంగల్, వేల్పూర్, నవీపేట్, పోతంగల్ ప్రాంతాల్లోని 11 ఫారాల్లో వైరస్ విస్తరించగా 50 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. పెట్టుబడి మొత్తం కోల్పోయామని కోళ్ల ఫారాల నిర్వాహకులు తీవ్ర ఆందోళన కు గురవుతున్నారు.

నాటుకోడి కూరకు డిమాండ్...

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఏ చిన్న శుభకార్యం జరిగిన కోడిపుంజులు కోసి దావత్ చేయడం ఆనవాయితీగా వస్తుండేది. కాలక్రమేణ పౌల్ట్రీ పరిశ్రమ గ్రామాలకు విస్తరించడంతో చికెన్ లభ్యత విపరీతంగా పెరిగింది. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నాటు కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్ల సహజసిద్ధంగా పెరగడంతో వీటిని తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. ఒక్కో నాటుకోడి 600కు పైగా కొనుగోలు చేస్తుండగా, ఆర్డర్ మెస్‌లలో కేజీ 1200 చెల్లించి రుచి చూస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో బాయిలర్ కోళ్లను పెంచుతున్న ఫారాలు మొత్తం 100కు పైగా ఉండగా, లేయర్ ఫారాలు 20 వరకు ఉన్నాయి. ఒకదాని నుంచి మరొక దానికి వైరస్ వేగంగా వ్యాప్తిస్తుండడంతో కోళ్ల మరణాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. వైరస్ సోకిన ఒకటి రెండు రోజుల్లోనే చనిపోతున్నాయని, మందులు వాడిన ప్రయోజనం ఉండడం లేదని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. వేల్పూర్ మండలంలోని లక్కోరా గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్ కు చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు మృతి చెందగా పశు సంవర్తక శాఖ అధికారులు సందర్శించి వివరాలు తెలుసుకొని కోళ్ల నుంచి రక్త నమూనాలను సేకరించి హైదరాబాద్ లోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ యూనిట్‌కు పంపించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కోళ్ల ఫారాలలో జీవ సంరక్షణ చర్యలు చేపట్టాలని, తరచుగా శానిటేషన్ చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ బోధన్‌కు 18 అవార్డులు



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లర్ ఆఫ్ బోధన్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 18 అవార్డులను కైవసం చేసుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఏర్పడినప్పటి నుండి నిరుపేదలు, నిరాశ్రయులు కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వారికి నిత్యవసర సరుకులు అందించి, కరోనా కాలంలో వారి సేవలను అందించారు. ఆరోగ్య శిబిరాలు, ఉచిత కంటి శిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలను ఆదుకున్నారు. వారి సేవలకు గుర్తింపుగా 18 అవార్డులు రావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులు సాధించిన లయన్స్ ప్రతినిధులను లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు లయన్ బసవేశ్వర రావు, లయన్ నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు . మరోసారి కొడాలి కిషోర్ ఉత్తమ లయన్స్ క్లబ్ బోధన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఉత్తమ కార్యదర్శిగా ఉమేష్ షిండే, ఉత్తమ కోశాధికారిగా సురేందర్ చౌదరి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ గవర్నర్ లక్ష్మి మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ప్రదీప్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- పిడిఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్లు విడుదల చేయాలని, పాఠశాల విద్యలో 5,8 తరగతులకు డిటెన్షన్ విధానం రద్దు చేయాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, అమెరికాలో భారత పౌరులపై ట్రంప్ దుశ్చర్యలను ఖండించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. ఎన్ఆర్ భవన్ కోటగల్లి ఆఫీసులో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు. జాతీయ నాయకులు నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్. అనిల్ మాట్లాడుతూ... సంవత్సరం పూర్తి అయినా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం, స్వయానా ముఖ్యమంత్రి ఉండి కూడా ఏండ్లుగా పేరుకుపోయిన పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను బకాయిల విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడంవల్ల విద్యాభ్యాసం పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. పక్క రాష్ట్రంలో అమలవుతున్నా రేవంత్ రెడ్డి కనీసం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. నూతన జాతీయ విద్యా విధానంపై స్పష్టమైన వైఖరి తెలపడంలో విఫలం అవడం, కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో 5,8 తరగతులకు డిటెన్షన్ విధానం రద్దుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వెల్లడించాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి దెబ్బతీసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయన్నారు. భారత పౌరులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుశ్చర్యలను ఖండించకుండా భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన విద్యకై, ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్లాలని లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు మమత, నాగేష్, నసీర్, సృజన్, సునీల్, అరుణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ ఫొటో జర్నలిస్ట్ రమణ మృతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

అనారోగ్యంతో బాధపడుతూ సీనియర్ ఫొటో జర్నలిస్టు రమణ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ ఫోటో జర్నలిస్టు రమణ మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో జర్నలిస్టులు పాల్గొన్నారు. సీనియర్ ఫోటో జర్నలిస్టు రమణ పలు ప్రముఖ పత్రికల్లో ఫొటో జర్నలిస్టుగా సేవలు అందించారు. ఆయన కెమెరా కళ్లతో ఫోటో చిత్రాలను ప్రపంచానికి పరిచయం చేశారు. నిజామాబాద్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రమణ కుటుంబానికి పదివేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నగర జర్నలిస్టులు, ప్రెస్‌క్లబర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గాంధీనగర్ లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ బుధవారం తెలిపారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామ శివారులోని గాంధీనగర్‌లో ఓ గుడిసెలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజా పంపిణీ బియ్యం ఏడు బస్తాలు (5.20 క్వింటాల్ల) బియ్యం సీజ్ చేసి చేసినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి, సీజ్ చేసిన ప్రజా పంపిణీ బియ్యం భద్రత నిమిత్తం స్థానికంగా ఉన్న వెంకటేశ్వర రైస్ మిల్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. అక్రమ ప్రజా పంపిణీ బియ్యాన్ని సేకరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐ శరత్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా సేకరించిన, తరలించిన చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి వేడుకలు



సంత్ రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మోచిల ఆరాధ్య దైవం శ్రీ గురు సంత్ రవిదాస్ 648 జయంతి వేడుకలను ముప్కాల్ మోచి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఓటర్ కార్ రమేష్ మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ భక్తి ఉద్యమాన్ని, సమరసత భావాన్ని ప్రజలకు చాటి చెప్పిన విధానాన్ని వివరించారు. సమాజ శ్రేయస్సు కోసం పరితపించిన గొప్ప మేధావి సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ అని గుర్తుచేశారు. ఆయన సూచించిన మార్గం అందరికీ అనుసరణీయమని అన్నారు. చర్మకార కులంలో పుట్టిన వజ్రంగా సంత్ రవిదాస్‌ను అభివర్ణించారు. మానవతా సుగంధాన్ని విరజిమ్మే కవితోద్యమం ఆయన సొంతమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్నేహభావంతో మెలగాలని, మనుషులంతా ఒక్కటేనన్న సమానత్వ సందేశాన్ని 14వ శతాబ్దంలోనే ఇచ్చిన సంత్ రవిదాస్ గొప్ప మహానుభావుడని కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సైతం సంత్ రవిదాస్‌ను అనుసరించినట్టు గత చరిత్ర తెలియజేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పోశెట్టి, కిరణ్ కుమార్, గంగారాం, దిలీప్, ప్రవీణ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్

1104 యూనియన్ ఏర్పాటయి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో యూనియన్ నాయకులు 1104 ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద 1104 యూనియన్ యొక్క పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ ఏర్పడిన తర్వాత ఉద్యోగులు అనేక హక్కులు, సమస్యల పరిష్కారం చేసుకోవడంతోపాటు, విద్యుత్ శాఖ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, కంపెనీ కార్యవర్గ సభ్యులు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ సంతోష్ కుమార్, లైన్‌మెన్లు గంగాధర్, కంచేటి, అసిస్టెంట్ లైన్మెన్ యాదగిరి, సత్యం, నరేందర్, సోమయ్య, విట్టల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, మెండోరా సెక్షన్స్ కార్యాలయం వద్ద 1104 యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం సెక్షన్ ప్రతినిధులు, డివిజన్, జిల్లా నాయకులు వేడుకల్ని నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్షన్, డివిజన్, జిల్లా నాయకులు పోశెట్టి, వసంత్ రావు, భూమేశ్వర్, ఈశ్వర్, పీర్యా, గంగాధర్, రాంచందర్, దేవేందర్, మోహన్, చంద్రశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు..

అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు పర్యవేక్షణ చేస్తాం

- అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ తరపున బుధవారం పోషణ్ అభియాన్ సపోషిత్ గ్రామ పంచాయతీపైన సమన్వయ సమావేశం అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సపోషిత్ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన వాటిలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు టాయ్ లెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎలక్ట్రిసిటీ, పెరుగుదల పర్యవేక్షణ, పిల్లలలో పోషణ లోపం తగ్గించడం మొదలైన ఇండికేటర్స్‌ని రాష్ట్ర, కేంద్ర శాఖ టీమ్స్ సందర్శనకు వచ్చే వరకు అన్ని శాఖల సమన్వయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, సిడిపిఓలు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ద్రోణగిరి గుట్ట జాతర ఉత్సవాలు



నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ శివ శ్రీనివాస ద్రోణగిరి గుట్ట దేవస్థానం ఉత్సవాలు ఈ నెల 10న ప్రారంభమై బుధవారం తో ముగిసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్ తెలిపారు. మరోవైపు మల్లన్న దేవుని ఉత్సవాలు సైతం ముగిశాయన్నారు. బుధవారం స్వామి వారి కళ్యాణం, మధ్యాహ్నం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. సాయంత్రం 'గిరి ప్రదక్షిణ'లో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ నేర నర్సయ్య, కోశాధికారి ముస్కు చిన్న నర్సయ్య, కమిటీ సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జడ్పీహెచ్‌ఎస్ ముచ్కూర్ విద్యార్థి



నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఈనెల 13 నుండి 16వరకు డిస్టిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, శంబాజీ నగర్, మహారాష్ట్రలో జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్-14 పోటీలలో భీంగల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముచ్కూర్ విద్యార్థిని కాకర్ల నిహారిక పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి సుజాత తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు. ముచ్కూర్ విద్యార్థిని నిహారిక జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా అంతం గంగా గౌడ్, పల్లికొండ ప్రసాద్, డిష్ గంగాధర్, నంద్యాలం బాలయ్య, కొడిగెల శ్రీనివాస్, బురెడ్డి లోకేష్ రెడ్డి, కర్నాల నర్సయ్య ఆర్థిక సహాయం అందించి నిహారికను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్ర పోటీలలో జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలవడానికి కీలకపాత్ర పోషించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలని అన్నారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర జాతీయ పోటీల్లో రాణిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో గల బైపాస్ రోడ్డు జాతీయ రహదారి -44 పైన బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం డీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారని ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి తెల్ల చొక్క, బ్లూ కలర్ లుంగీ ధరించినట్లు పేర్కొన్నారు. వయస్సు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండొచ్చని అన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది నంబర్లను 8712659859, 8712659863 సంప్రదించాలన్నారు..

సాలూర హైస్కూల్ విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం పిఎంశ్రీ గ్రీన్ స్కూల్ ఫీల్డ్ విజిట్ లో భాగంగా మండలంలోని జైతాపూర్ గ్రామంలోని ఆదర్శ రైతు కరుటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. విద్యార్థుల్లో పని గౌరవం, సాంప్రదాయ వ్యవసాయం పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకోవటానికి ఈ క్షేత్ర సందర్శన చేసినట్టు హెచ్ఎం, ఎంఈఓ రాజిమంజూష తెలిపారు. ఆదర్శ రైతు పాపారావు వ్యవసాయ క్షేత్రంలో వారు అవలంభిస్తున్న వ్యవసాయం పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గోకృపామృతం, జీవామృతం, పంచగవ్య, వ్యవసాయ పద్ధతులను పాపారావు విద్యార్థులకు వివరించారు. నేల సారవంతంగా ఉన్నప్పుడే పంటలు బాగా పండుతాయని, రసాయన ఎరువుల మూలంగా పండ్లు, కూరగాయలు, ఆహార ధాన్యాలు వాటి వ్యర్థాలను కలిగి ఉంటున్నాయని తెలిపారు. కావున సేంద్రీయ వ్యవసాయం చేయడం ఈరోజుల్లో ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయులు రాజీ మంజూషా తెలిపారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా వ్యవసాయ విధానాలు మారాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ , రాజ్ కుమార్, విఠల్ , విజయలక్ష్మి, లింబగిరి జ్యోష్ణ, లక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రానికి చెందిన కీసరి మైసయ్య టిప్పర్ ప్రమాదంలో మంగళవారం మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.5000 నగదు బుధవారం బాధిత కుటుంబానికి అందజేసినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు తెలిపారు. మండల పంచాయతీ అధికారిని సవితారెడ్డి సైతం రూ.5000 అందించినట్టు పంచాయతీ కార్యదర్శి బాలయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబిర్ శ్యామ్‌రావు, ఏ.వెంకట్ రామ్‌రెడ్డి, గంగారం, స్వామి, ఎం.బాలరాజ్, తదితరులున్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని పొందుర్తి గ్రామంలో ఉన్న ఎంపీయుపిఎస్ పాఠశాల నుండి విద్యార్థులు బుధవారం హైదరాబాద్ లోని జూ పార్క్, సాలార్జంగ్ మ్యూజియం, బిర్లా మందిర్ లకు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు రాజ్ తెలిపారు. ఈ విహార యాత్రకు పాఠశాల ఉపాధ్యాయులు స్వామి, నటరాజ్, వీణ రాణి, విద్యార్థులు వెళ్లారు.


విజ్ఞాన విహార యాత్రలో పాల్గొన్న విద్యార్థులు

గ్రామాల్లో గోధుమల పండుగ

- కొత్త గోధుమలు రాక

నవతెలంగాణ-జుక్కల్



జుక్కల్ నియోజకవర్గంలోని గ్రామాలలో కొత్త గోధుమల తినే పండుగ ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములలో కొత్తగా పండించిన గోధుమలు తమ ఇంటికి తీసుకొని వచ్చి వాటితో పిండి పట్టించి పిండి వంటకాలు తయారు చేయడం.. అనంతరం తయారు చేసిన వాటిని గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పండుగకు ఇంటి ఆడపడుచులను, బంధుమిత్రులను ఆహ్వానిస్తారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్



వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగంపల్లి గ్రామానికి చెందిన తిరుపతి (52) 15 రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయాడు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

మురికి కాలువల నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామంలో బుధవారం మురికి కాలువ నిర్మాణం పనులు ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మహేష్ గౌడ్ తెలిపారు. నల్లమడ గ్రామంలో గతంలో మురికి కాలువలు నిర్మాణం చేపట్టే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో మురికి నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు రోగాల బారిన పడుతుండటంతో.. పనులు చేపట్టేందుకు నిధులు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామంలో రోడ్డు కిరువైపులా మురికి కాలువ లేకపోవడం వల్ల ఇండ్లలోని మురికి నీళ్లు రోడ్లపై ప్రవహిస్తుందని యుద్ధ ప్రాతిపదిక మీద పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, ప్రశాంత్, సతీష్, సాయిలు, గ్రామస్తులు ఉన్నారు.

చేపలవేటకు వెళ్లి చెరువులో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలో ప్రమాదవశాత్తు బొబ్బిలి చెరువులో పడి యువకుడు మరణించిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాత హరిజనవాడ కాలనీకి చెందిన రాజశేఖర్ (33) సోమవారం చేపలు పట్టడానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం చెరువు సమీపంలో శవం కనిపించడంతో స్థానికులు.. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పలువురి ముందస్తు అరెస్టు


అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వరపల్లి గ్రామంలో పలువురు మున్నూరు కాపు సామాజిక వర్గం వారిని బుధవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరనున్న తమను అక్రమంగా అరెస్ట్ చేసినట్లు రమేష్, బాల్‌రాజు, శ్రీనివాస్ ఆరోపించారు. కులగణనలో తెలంగాణలో అత్యధికంగా ఉన్న బీసీలను తక్కువగా చూపించడం సరైంది కాదన్నారు.

రోడ్లపై వాహనాలు నిలపొద్దు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్లుకు ఇరు ప్రక్కల వాహనాలు చేర్చి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వాహనాలను గుర్తించి వారికి జరిమానా విధించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల నుండి కామారెడ్డి పట్టణములో ఉన్న స్టేషన్ రోడ్డు, సుభాష్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, ఓల్డ్ నేషనల్ హైవే-7, పై ట్రాఫిక్ నిలిపి ప్రజలకు ఇబ్బందిలు కలుగుతుందన్నారు. క్రేన్ సహాయముతో వాహనాలను తొలగించి ఫైన్‌లు విదించామన్నారు. అక్రమముగా రోడ్‌ల ఆక్రమించి, రోడ్ లపై వారి షాపులకి సంబందించిన బోర్డ్స్ పెట్టిన యజమానులకు, చిరు వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఆక్రమణలను తొలగించినట్టు తెలిపారు. ఇట్టి పనులను ఎస్పీ కామారెడ్డి సూచనతో, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఆధ్వర్యంలో ఈ ఎన్ఫోర్స్మెంట్ వర్క్ నీ పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, సిబ్బందితో కలిసి చేసి మొత్తం 24 వాహనాలు (16 బైక్‌లు, 8 కార్‌లు)లను సీజ్ చేసి, చాలన్‌లు విధించినున్నట్టు తెలిపారు.

విద్యుత్ ఎంప్లాయిస్ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి అయినందున సబ్ స్టేషన్ ఆవరణలో 1104 జెండా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టభద్ధత పట్ల హర్షం

నవతెలంగాణ-జుక్కల్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టభద్ధత కల్పించడంతో పాటు షెడ్యూల్ కులాలను ఏ.బీ.సీ కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో మాదిగ ప్రజాప్రతినిధులతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వర్గీకరణ అంశంపై ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేసి, వర్గీకరణకు చట్టభద్ధత కల్పించడానికి శాసన సభలో చర్చించి, షెడ్యూల్ కులాలకు ఏ.బీ.సీ కేటగిరీలలో రిజర్వేషన్లు అమలు చేయడానికి కార్యాచరణ ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి మాదిగ, మాదిగ ఉప కులాల తరపున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధిని కవిత పాల్గొన్నారు.


సీఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే విందులో హాజరైన మందకృష్ణ మాదిగ

ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఇచ్చిన ఆత్మీయ విందులో మంద కృష్ణ మాదిగ మంగళవారం పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని తన ఇంటికి ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ వెంట వచ్చిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్, ప్రముఖ రచయిత మచ్చ దేవేందర్, పాటమ్మ రాంబాబు, జైభీమ్ టీవీ సంస్థల చైర్మన్ బరిగెల శివ, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-దోమకొండ

ప్రతి రైతుకు రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మాజీ జడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, గారి ఆదేశాల మేరకు గ్రామాలలో ఉన్నువంటి రైతులకు రైతు భరోసా, పథకాలను వివరించినట్టు తెలిపారు. మండలంలోని రైతు భరోసా పథకం కోసం ఎంపికైన 8541 మంది, రైతులకు సంబంధించి. 6909 ఎకరాలకు 8 కోట్ల 29 లక్షల 11329 రూపాయలు, రైతుల ఖాతాలలో జమ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు రెండు ఎకరాల వరకు ఉన్న రైతులకు, వారి ఖాతాలలో రైతు భరోసా జమ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం మిగతా రైతులందరికీ కూడా త్వరలోనే రైతు భరోసాను జమ చేస్తుందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులచే ప్రభుత్వం, ఎంపిక చేసిన భూములు అన్నింటికీ రైతు భరోసాను అందజేయ నున్నట్టు తెలిపారు. రైతులు ఎవరు కూడా దిగులు చెంద వద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కదిరె గోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పాలకేంద్రం డైరీ అధ్యక్షుడు మందుగుల నరేష్, నేతుల మల్లేశం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విద్యాశాఖకు మంత్రిని కేటాయించేది ఎన్నడు..?

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి కేసిఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని పిడియస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జి సురేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయింది అని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నదనీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఒకపక్క గురుకుల విద్యాలయాల లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే, మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అర కొర సౌకర్యాలు, అధ్యాపకుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ తరగతి గదులు, శిథిలావస్థలో బిల్డింగులు, అద్దె భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యా సంస్థలు కొట్టుమిట్టాడు తుంటే, ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వ చేయూత ఏమాత్రం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలనే డిమాండ్‌తో 13-15వ తేదీల మధ్య పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సతీష్, శ్రీకాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు సభ్యులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- కవితను కలిసిన మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ గౌడ్


కవితకు బొకే అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బుధవారం హైదరాబాద్‌లో ఆమె నివాసంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే బీ జనార్ధన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించినట్లు ఆమె చెప్పారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ప్రతి కార్యకర్తకు అందుబాటులో నాయకులు ఉండాలని ఆమె సూచించారు. జాగృతి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు. ఆపదలో ఉన్న వారికి జాగృతి అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్, గాంధారి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సర్వాపురం సత్యంరావు, నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

ఎంపీటీసీ-14, ఒక జడ్పిటిసి స్థానానికి సంబంధించిన ఎన్నికలపై పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి సమావేశం నిర్వహించినట్టు ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరు కావాలని, 67 పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా, ఇతర వివరాలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రోడ్డుపై వదిలేసిన ఉన్న బైక్

- భయాందోళనకు గురవుతున్న స్థానికులు

నవతెలంగాణ-బీర్కూర్ (నసురుల్లాబాద్)



బీర్కూర్ మండలంలోని బీర్కూర్ మిర్జాపూర్ వెళ్లే రహదారిపై అనుమానాస్పద మోటార్ సైకిల్ వదిలేసి వెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీర్కూర్ నుండి మీర్జాపూర్ వెళ్లే పెద్ద చెరువు అలుగు సమీపంలోని రహదారి పక్కన హీరో హెూండా వాహనం ఏపీ 25 ఆర్ 3297 గల వాహనాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గత వారం నాలుగు రోజుల క్రితం రోడ్డుపై బలిసి వెళ్లారని చుట్టుపక్క రైతులు తెలిపారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించిన ఇప్పటికీ ఈ వాహనం ఎవరు తీసుకెళ్లడం లేదని ఇంతకు ఈ వాహనం ఎవరిదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వాహనం విషయమై ఈ చాలన్‌లో సెర్చ్ చేయగా వాహనం యజమాని గంగారం పేరున హైదరాబాదులో 2021 నుంచి 2022 వరకు మూడు పోలీస్ చలాన్‌లు పడ్డాయి.

యూపీఎస్‌పై మార్చి 2న యుద్ధభేరి

నవతెలంగాణ-లింగంపేట్

టిఎస్‌సిఎస్‌సియు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో మండల విద్యాధికారి షౌకత్ అలీ చేతుల మీదుగా గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యుపిఎస్ విధానానికి వ్యతిరేకంగా మార్చ్ 2న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో యుద్ధభేరి కార్యక్రమం తలపెట్టినట్టు తెలిపారు. ఇప్పటికె రెండు రాష్ట్రాలు మహారాష్ట్ర, ఒడిశా ఎప్రిల్ మొదట 2025 నుండి అమలు చెయ్యడానికి సమ్మతి తెలిపాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చారని, కావున ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ ఇవ్వాల్సిందిగా కోరారు. మార్చ్ 2న హైదరాబాద్ లో జరిగే ధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రాము, రవి, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్,రవిబాబు, రాజ్ కుమర్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ

నవతెలంగాణ-జుక్కల్



జుక్కల్ మండల కేంద్రానికి చెంధింన మచ్కూరీ పండరి అనే యువకుడు తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా పోలీసులు ట్రేస్ చేసి ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి బుధవారం అందజేసినట్టు ఎస్ఐ భువనేశ్వర్ తెలిపారు.

సదరం సర్టిఫికేట్ ఇవ్వండి సారూ

నవతెలంగాణ-కామారెడ్డి



సదరం క్యాంపు సర్టిఫికెట్ తనకు ఇప్పించండి సార్ అంటూ బిబిపేట్ మండల కేంద్రానికి చెందిన నరేందర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రానికి చెందిన తాను 100 శాతం వికలాంగుణ్ణి అయినప్పటికీ సదరం క్యాంపునకు ఏడాదిగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో నిర్వహించే సదరం క్యాంపునకు గత సంవత్సరం నుండి పది సార్లు వచ్చానని, నడవలేని స్థితిలో ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలని, తమనకు సదరం సర్టిఫికేట్ ఇప్పించాలని కోరుతున్నాడు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్



పొలానికి పారుతున్న నీటిని చూడడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పాప హరేశ్వర కుంటలో జారిపడి మరణించిన ఘటన మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. వడ్డేపల్లి గ్రామంలోని బాలయ్య (58) అతని భార్య, కొడుకుతో బుధవారం ఉదయం 8 గంటలకు ముగ్గురు కలిసి వారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. అతని భార్య కొడుకు పొలంలో పనిచేస్తుండగా బాలయ్య పొలానికి పారుతున్న నీటిని చూసేందుకు పాపహరేశ్వర కుంట వద్దకి వెళ్ళాడు. చాలా సమయం అయినా ఇంకా పొలానికి తిరిగి రాకపోవడంతో కొడుకు రమేష్ కుంట వద్దకు వెళ్లగా తూము వద్ద జారి పడి ఉన్నాడని ఇతరుల సాయంతో రమేష్ బాలయ్యను బయటకు తీయగా.. అప్పటికే చనిపోయి ఉన్నాడని ఎస్ ఐ తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

'ఫ్యాబ్యులస్ 40 స్కాలర్‌షిప్‌కు ఎంపిక


విద్యార్థినికి ప్రశంసపత్రం అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డికి చెందిన విద్యార్థిని ఎం. లావణ్య "ఫ్యాబ్యులస్ 40 స్కాలర్షిప్" కి ఎంపికైంది. ఆమె అద్భుతమైన అకాడమిక్ ప్రదర్శన సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాథమటిక్స్ రంగంలో ఉన్నంతంగా రాణించినందుకు స్కాలర్షిప్ కి ఎంపికైంది. డాక్టర్ ఉజ్మా సుల్తానా మార్గదర్శకత్వం లో ఆమె ఈ అవకాశాన్ని పొందింది. ఇందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్స్ మీనా, శ్రావణి తో పాటు కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి


నవతెలంగాణ-పిట్లం


మాట్లాడుతున్న మండల అధ్యక్షులు

గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్ర వరి 15ను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిం చాలని గిరిజన శక్తి మండ ల అధ్యక్షులు లకావ త్ గోపాల్ డిమాండ్ చేశారు. బుధవా రమిక్కడ మాట్లాడు తూ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ అభివృద్ధికి చైతన్య పరచడానికి , బంజారా బిడ్డలను భక్తి మార్గంలో నడిపించేలా చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా కృషి చేశారని అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినముగా ప్రకటించి బంజారాలకు ఆత్మగౌరవము దక్కేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల బంజారా నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. బాన్సువాడ పట్టణంలోని ఓ ప్రైవేటు పెళ్లి మండపంలో వివిధ మండలాల రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖ మండలాల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో డీపీఓ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలను తూచా తప్పకుండా ప్రతి ఒక్కరు అమలు చేయాలని, ఎన్నికల నిబంధనలకు అందరూ కట్టుబడి పని చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరు బేఖాతారు చేయవద్దన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి కౌంటింగ్ వరకు స్థానిక ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి పూర్తిబాధ్యత తీసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ వివిధ మండలాల తహసిల్దార్లు ఎంపీడీవోలు, ఎంపీఓ లు స్టేజ్ 1 ఆఫీసర్లు స్టేజి 2 ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ లైన్‌మెన్ అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో విద్యుత్ సంస్థలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ 2024-25 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ఉత్తమ లైన్‌మెన్ అవార్డు పొందిన రాజశేఖర్‌ను స్థానిక డిటిడిసి కొరియర్ సర్వీస్ నిర్వాహకుడు అరుణ్ బుధవారం ఘనంగా సన్మానించారు. గత నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఆ సంస్థ ఉన్నతాధికారులు లైన్‌మెన్ రాజశేఖర్ తెలంగాణ రాష్ట్ర ఉత్తమ లైన్‌మెన్ అవార్డు సత్కరించారు. భవిష్యత్తులో ప్రజలకు మరింతగా విద్యుత్ సంస్థలో సేవలు అందించడం ద్వారా లైన్ మెన్ రాజశేఖర్ మరెన్నో అవార్డులు రివార్డులు పొందాలని సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాకూరి గంగాధర్, డాకురి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయునికి సన్మానం



నవతెలంగాణ-బాల్కొండ

తెలుగు భాషోపాధ్యాయుల ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల సముదాయ సమావేశం బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్పీలు ఐఎఫ్‌పిబిపై ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో మరింత అధిక సమాచారాన్నివ్వడంలో ఈ శిక్షణ ఉపయుక్తమవుతుందని వారు తెలిపారు. ఇటీవల డాక్టరేట్ సాధించిన కోమన్ పల్లి తెలుగు భాషోపాధ్యాయులు కోకిల నాగరాజును ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, భాషోపాధ్యాయులు సన్మానించారు. ఆర్పీలు డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్, డాక్టర్ కోకిలనాగరాజు, రవి, రాజలింగం, సత్యనారాయణ, గోపి, అనురాధ, ఉపాధ్యాయులు నాగుల రాజేందర్ గౌడ్, బోచ్కర్ శ్రీనివాస్, శ్రీలక్ష్మీ, అహల్య దేవి, రామ్, ప్రభు, వివేకవర్ధన్, పద్మ అరుణ, విష్ణు ప్రియ, తెలుగు భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

14న విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో ఈ నెల 14 శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిజిఆర్ఎఫ్ చైర్మన్, అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మకళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని కొప్పర్తి క్యాంప్, సాలూర క్యాంప్ గ్రామాలలో బుధవారం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి కళ్యాణమహోత్సవంలో పాల్గొన్నారు.

రెవెన్యూలో వీఆర్వోల పాత్ర కీలకం

- జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరచడంలో వీఆర్వోల పాత్ర కీలకమని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. నిజామాబాద్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వీఆర్వోల నియామకానికి ప్రభుత్వ జాప్యం తగదని, పాత వీఆర్వోలకు రాత పరీక్ష నిర్వహించడం అంటే వారి గత సర్వీసును అవమానించినట్టేనని తీవ్రంగా విమర్శించారు.

వీఆర్వోల నియామకం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టత లేకపోవడం సరికాదని అన్నారు. వెంటనే రాష్ట్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో వీఆర్ఓలను నియమించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను వాసు వడ్లూరి డిమాండ్ చేశారు.

షబ్ ఏ బరాత్ ఏర్పాట్లకోసం పరిశీలన

- శ్మశాన వాటికలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

షబ్-ఎ-బరాత్ దృష్ట్యా, ముస్లిం భక్తులు ప్రార్థనల కోసం శ్మశానవాటికలకు వెళతారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ బుధవారం ముస్లిం స్మశానవాటికలను సందర్శించారు. లైట్లు ఏర్పాటు చేయడం, శ్మశానవాటికలను శుభ్రపరచడం మొదలైన వాటిని పరిశీలించారు. పడిపోయిన, ఎండిన మొక్కలను తొలగించాలని, స్మశానవాటికల నుండి చెత్తను తొలగించాలని, వాకింగ్ ప్లాట్‌ఫారంపై మొక్కలు, గడ్డిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా అందేలా చూడాలి

నవతెలంగాణ-ఆర్మూర్

వ్యాధి నిరోధక టీకాలు ప్రతి ఒక్క చిన్నారికి అందే విధంగా చూడాలని హెల్త్ సూపర్వైజర్ అనసూయ కుమారి ఆదేశించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగింది . రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల లబ్ధిదారుల జాబితాను ముందస్తుగా తయారు చేసుకుని ప్రతి చిన్నారికి టీకాలు అందే విధంగా ఆశా కార్యకర్తలు చూడాలని ఆదేశించారు వ్యాక్సిన్ కోల్డ్ చైల్డ్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఆశా కార్యకర్తలు శిరీష, గర్భిణి స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

2వ సాధారణ మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2వ సాధారణ మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు-2025 కు సంబంధించిన సమావేశం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిజామాబాద్ డివిజన్‌కు సంబందించిన జెడ్పిటిసి ఆర్వోస్, ఎంపీటీసీ ఆర్వోస్, ఏఆర్ఓల ఎన్నికల శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జి.సాయన్న, నిజామాబాద్ డివిజన్ ఎంపీడీఓలు, ఆర్ఓలు, ఏఆర్ఓలు మాస్టర్ ట్రైనర్స్ యం.నరేందర్, డి.చంద్రశేఖర్, పి.శ్రీధర్, పి.ప్రదీప్ పాల్గొన్నారు.

రక్తదాతకు ఘన సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన నల్ల గణేష్ గుప్తా 39 సార్లు రక్తదానం చేసి రక్తదాతగా పేరుగాంచారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక పుస్తక రచయిత్రి మగ్గిడి లక్ష్మి సహకారంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రక్తదాత నల్ల గణేష్ గుప్తాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత్రి మగ్గిడి లక్ష్మి మాట్లాడుతూ.. మండలంలోనే అత్యధిక సార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా నిలవడం మండలానికి గర్వకారణం అన్నారు. యువత రక్తదానంలో ముందుండాలని, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రజలు రక్తదానం పట్ల ఎలాంటి అపోహలకు గురి కావద్దని తెలిపారు. అనంతరం రక్తదాత గణేష్ గుప్తా మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉండి తనను సంప్రదించిన వారికి ఎల్లప్పుడూ రక్తాన్ని అందించేందుకు అందుబాటులో ఉంటానన్నారు. తనను సత్కరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, స్థానిక నాయకులు నవాతే రంజిత్ కుమార్, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయా చెక్కులను భీంగల్ మున్సిపల్ పరిధిలో లబ్దిదారులకు బుధవారం పంపిణీ చేశారు. చెక్కుల మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షులు జెజె నర్సయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అనంతరావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్ర, మహిళా అధ్యక్షురాలు కల్పన, కౌన్సిలర్ సీఎస్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

విపత్తులు సంభవించిన సమయాల్లో వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టేలా ఆపద మిత్ర వాలంటీర్లకు వివిధ అంశాలలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. సుశిక్షితులైన ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, మత్స్యశాఖ అధికారులతో పాటు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే అంశాలపై ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ అందిస్తుండగా, వారు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద రఘునాథ చెరువులో బుధవారం వరదలు, నీటి ప్రమాద ఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఆపదమిత్రలకు ప్రయోగాత్మక శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రెస్క్యూ బోట్‌ను ఎలా ఆపరేట్ చేయాలి, రెస్క్యూ రోప్, రెస్క్యూ ట్యూబ్, రెస్క్యూ గార్డ్, ఫ్లోటర్ తదితర వాటిని ఎలా వినియోగించాలి అనే అంశాలను హైదరాబాద్ లోని మణికొండ కు చెందిన నోబుల్ లైఫ్ సేవింగ్ సొసైటీకి చెందిన మాస్టర్ ట్రైనర్ మహేష్, వినోద్, అనితా పటేల్ లు స్వయంగా చేసి చూపిస్తూ, ఆపదమిత్ర కార్యకర్తలతో చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ..ప్రకృతిపరంగా, మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవించిన సందర్భాల్లో ఆపదమిత్ర కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టే విధంగా వారిని అన్ని విధాలుగా సన్నద్ధం చేయడం జరుగుతోందని అన్నారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు, నీటి ప్రమాదాలు, భారీ జన సందోహం సమయాల్లో తొక్కిసలాట నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సేవలు తదితర అంశాలపై మూడు దశల్లో 22 రోజుల పాటు ఆపద మిత్రలకు శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి పది వేల రూపాయల విలువ చేసే విపత్తు సహాయ పరికరాలు అందించడంతో పాటు గుర్తింపు కార్డులు, బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి.పరమేశ్వర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ.విక్రమ్, కలెక్టరేట్ లోని విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు తదితరులు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్న పలువురు

మహనీయులు చూపిన బాటలో నడవాలి

- డా.వినయ్ ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యువత మహనీయులు చూపిన బాటలో నడవాలని డా.వినయ్ ధన్‌పాల్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతుల సందర్భంగా నగరంలోని బుధవారం నిర్వహించిన ఖేలో భారత్ బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా డా.వినయ్ ధన్‌పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, శారీరక, మానసిన దృఢత్వం కోసం విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ఖేలో భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతులు నిర్వహించడానికే పరిమితం కాకుండా మహనీయులు చూపిన బాటలో యువత నడవాలని తెలిపారు. అనంతరం వివిధ కళాశాల నుండి ఖేలో భారత్‌లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి లావణ్ జీ, ఇందూర్ ప్రముఖ్ రెంజర్ల నరేష్, విభాగ్ సంఘటన మంత్రి రాజ్‌సాగర్, విభాగ్ కన్వినర్ శశి, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ధన్‌పాల్ వినయ్

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న మండల విద్యాధికారి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈ నెల 13 నుంచి 16 వరకు డిస్ట్రిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, శంబాజీ నగర్, మహారాష్ట్రలో జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థిని చిక్కాల శ్రీ వర్షిని పాల్గొంటున్నట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్ర పోటీలలో జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలవడానికి కీలకపాత్ర పోషించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సునీత, కృష్ణ, మాలతి, ఓఎస్ శేఖర్ పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండలంలోని జానకంపేట్ సహకార సంఘంలో గతంలో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వచ్చిందని చైర్మన్ మిద్దె నరేందర్ బుధవారం తెలిపారు. కొత్త రుణాల చెక్కులను సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ రైతులకు పంపిణీ చేశారు. రుణాలను రైతులు వ్యవసాయ పంటలను మరింత అభివృద్ధి చేసుకొనుటకు ఉపయోగించుకోవాలని రైతులను కోరారు. అదేవిధంగా తీసుకున్న పంట రుణాలకు రైతులు ప్రతి సంవత్సరం సమయానికి వడ్డీ చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ రుణాలను మంజూరు చేసిన ఉమ్మడి నిజామాబాద్ సహకార సంఘం చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, సీఈఓ, నవీపేట బ్యాంక్ మేనేజర్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, సీఈఓ గంగారెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను సత్కరించిన త్రిపుర గవర్నర్

నవతెలంగాణ-మోపాల్

నర్సింగ్ పల్లి లోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో మా పల్లె సంస్థ పక్షాన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన కళాకారులను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అదే విధంగా ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి రచించిన పాటల సిడి శ్రీనివాసంను కూడ ఆవిష్కరించారు. కవి, వ్యాఖ్యాత ఘనపురం దేవేందర్, ప్రసిద్ధ కూచిపూడి, ఆంధ్ర నాట్యం ఆచార్యులు జయలక్ష్మి, ప్రసిద్ధ గాయనీమని సంగీత గురువు స్వప్న, ప్రముఖ రంగస్థలం సినీ నటుడు రవి, ప్రముఖ గాయకుడు సంగీత దర్శకుడు విజయ్‌ను గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా సంస్కృతి పరంగా భారతదేశం అత్యంత ధనవంతమైన దేశమని అన్నారు. అందుకు కవుల కళాకారుల పాత్ర అద్వితీయమని అభినందించారు. వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యక్రమాలలో కళాకారుల సహకారం అభినందనీయమని మా పల్లె ట్రస్ట్ దేవస్థానం ఆలయ ధర్మకర్త వి. నరసింహారెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో నిజాంబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుడిని సన్మానించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కళా ఉత్సవం అవార్డు అందుకున్న కంకణాల రాజేశ్వర్



నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కళలు, సాహిత్యం, సంస్కృతి, కవులు, కళాకారుల సమ్మేళనం (ఆట, పాట, మాట, ధూం ధాం) కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. కళా సంస్థ ఆహ్వానం మేరకు ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్ ఈ సమ్మేళనంలో పాల్గొని "జీవితం" అనే కవితా శీర్షికన కవితా పఠనం చేసి అద్భుతమైన ప్రతిభ కనబరిచినందుకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి (భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష నేత) కంకణాల రాజేశ్వర్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహుకరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక కళామండలి రాష్ట్ర అధ్యక్షురాలు పాట రాజశ్రీ, పాట మహేష్ తో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన సాంస్కృతిక సారథి కళాకారుడు రాంపూర్ సాయి తెలంగాణ సాంస్కృతి కోద్యమ కళాకారుడు పొగరి సంజీవ్ తెలంగాణ నలు దిక్కుల నుండి విచ్చేసిన కళాకారులు పాల్గొన్నారు.

భీంగల్ సీఐని కలిసిన నాయకులు

నవతెలగాణ-భీంగల్ రూరల్

భీంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పొన్నం సత్య నారాయణను భీంగల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోట సతీష్, సాయిబాబా, భూషణ్, రాంగిరి శ్రీను, రాజు, మండల ఉపాధ్యక్షులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యార్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంక్



విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న పంచ మహాల్కర్ రియా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్ వన్ 2025 ఫలితాలలో నిజామాబాద్ నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని పంచ మహాల్కర్ రియా 99.83 శాతం సాధించి నిజామాబాద్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల ఏజీఎం కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం కూడా తమ కళాశాల విద్యార్థి మధ్రి హర్ష 99.62 శాతంసాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచాడని, అదేవిధంగా గత సంవత్సరం అన్వేష్, మద్రి హర్ష ఇద్దరికీ ఐఐటి వారణాసి, ఐఐటి కాన్పూర్ లలో సీటు సాధించారని పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థులు ఎన్ఐటిలలో సీటు సాధించారని, అట్లాగే జేఈఈ మెయిన్ సెషన్ వన్‌లో ఈ సంవత్సరం కూడా నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలవడం చాలా అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిగౌడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేదరి శేఖర్, కోర్ డీన్‌యువి ప్రసాద్, జీయం కే.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో క్షత్రియ విద్యార్థి ప్రతిభ

ఆర్మూర్ : జేఈఈ మెయిన్స్ సెషన్ -1లో పట్టణంలోని క్షత్రియ జూనియర్ కళాశాల కు చెందిన విద్యార్థి కల్లెం వివేక్ రెడ్డి సాధించినట్టు కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ బుధవారం తెలిపారు.. వివేక్ రెడ్డి తండ్రి మల్లేష్ ప్రస్తుతం ఎమ్మార్వోగా పని చేస్తున్నారు. వీరి స్వగ్రామం ఆలూర్ అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్, ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపక బృందం అభినందించారు.



వివేక్ రెడ్డిని సన్మానించిన కళాశాల చైర్మన్

పాఠశాలకు మధ్యాహ్న భోజన వంట పాత్రల వితరణ



పాఠశాలకు వంట పాత్రలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి వంట పాత్రలను పాఠశాల పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. రూ.20వేల విలువ కలిగిన వంట పాత్రలను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం సహకారం అందించడం అభినందనీయన్నారు. వంట పాత్రలు అందించిన పూర్వ విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.మహేష్ గౌడ్, సిహెచ్.రామకృష్ణ, బి.స్వామి, ఎస్.పూర్ణచందర్, ఎం.నరేష్, సిహెచ్.సత్యనారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొమ్ముల రాజేందర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మొరంను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ బుధవారం తెలిపారు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా గాంధీనగర్ కు చెందిన డ్రైవర్ త్తరి చిన్న కొండయ్య, మల్లారంకు చెందిన టిప్పర్ యజమాని బొల్లమ్ నర్సయ్యను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. గతంలో ఇలాంటి నేరాలకు పాల్పడిన నాగారాని కి చెందిన మక్కల గోపాల్, దండ్ల సాయికుమార్, మల్లారానికి చెందిన మమ్మాయి అరుణ్, బొల్లమ్ నర్సయ్య ను తిరిగి ఇలాంటి నేరాలకు పాల్పడకుండా దక్షిణ మండల తహసీల్దార్ ముందర హాజరు పరిచామన్నారు. తహసీల్దార్ బుధవారం వారికి 5లక్షల రూపాయలు పూచికత్తుతో సంవత్సరం కాల పరిమితితో బైండోవర్ చేసినట్టు తెలిపారు.

అలరించిన కుస్తీ పోటీలు

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో బుధవారం వీరభద్ర మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కొనసాగుతున్నాయి. ఈ కుస్తీ పోటీలను సమీప ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి మల్ల యోధులు తరలివచ్చి ఈ పోటీల్లో తలపడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. జాతర సందర్భంగ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో రెండవ స్పెల్ చివరి రోజు ప్రయోగ పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను బుధవారం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. బుధవారం ప్రయోగ పరీక్షలు జరుగుతున్న కాకతీయ జూనియర్ కళాశాల, సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాల, ఎస్సార్ జూనియర్ కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు జిల్లాలో మరో 10 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి పరిశీలించి సమీక్షించారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ గురువారం నుండి ప్రారంభం కానున్న మూడవ స్పెల్. ప్రయోగ పరీక్షలకు అన్ని పరీక్ష కేంద్రాలను, ఎక్సామినెర్లను సిద్ధం చేశామని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం లో కెమెరాలకు జియో ట్యాగింగ్ పరిశీలించామని, కెమరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. లైవ్ కెమెరాల ద్వారా హైదరాబాద్ లో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.



ప్రయోగపరీక్షలను తనిఖీ చేస్తున్న డీఐఈవో

జల్సాల కోసం చోరీలు

- తాళాలు వేసి ఉన్న ఇండ్లే టార్గెట్
- దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్
- బంగారు ఆభరణాలు, సెల్ఫోన్, స్కూటీ, 15 వేలనగదు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో జల్సాలకు అలవాటు పడి తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సౌత్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్ సురేష్ తెలిపారు. బుధవారం నగరంలోని సౌత్ సర్కిల్ సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల సమయంలో అర్సపల్లి నాలెడ్జ్ పార్క్ స్కూల్ వద్ద అరవ టౌన్ ఎస్ఐ వెంకట్రావు తన సిబ్బందితో వెహికల్ చెకింగ్ చేసేటప్పుడు ఒక వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని స్కూటీపై అనుమానాస్పదంగా కనిపించగా ఆయన్ను పట్టుకొని విచారించగా ఆటోనగర్ కు చెందిన షేక్ అఫ్ తాబ్ షేక్ అని చెప్పాడని అన్నారు. స్కూటీ డిక్కీని ఓపెన్ చేసి చూడగా అందులో ఒక సంచిలో బంగారు ఆభరణాలు, దొంగతనం చేయడానికి ఉపయోగించే వస్తువులను గమనించి స్వాధీనం చేసుకున్నామన్నారు. జల్సాలకు అలవాటు పడి కొన్ని రోజులుగా తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఫిబ్రవరి 7న ఆటో నగర్ లోని ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడి అక్కడ దొంగిలించిన ఆభరణాలను అమ్ముకోవడానికి వెళ్లే క్రమంలో ఆయన్ను పట్టుకున్నామన్నారు. ఆయన వద్ద నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల బంగారు నెక్లెస్, బంగారు చైన్ తులం నర, మూడు జతల చెవి కమ్మలు, రెండు జతల ముక్కుపుడకలు, మొత్తం తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాలను, రెండు గడియారాలు ఒక సెల్ ఫోను, స్కూటీని 15 వేల రూపాయలను సీజ్ చేశామన్నారు. ఇంతకుముందు కూడా మూడు ఇండ్లలో దొంగతనానికి పాల్పడినట్లు వివరించారు.ఈ కేసును ఛేదించిన ఆరవటౌన్ ఎస్ఐ వెంకటరావుని సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నరేష్

ట్రాక్టర్ చోరీ కేసులో నిందితుల అరెస్టు

- ట్రాక్టర్, ట్రాలీ స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఆర్మూర్ రూరల్ సిఐ శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామంలో ట్రాక్టర్ చోరీ కేసులో ముగ్గురు నిందితులతో పాటు ఒక కొనుగోలుదారుని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ రూరల్ సిఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ శ్రీధర్ రెడ్డి, బాల్కొండ ఇన్చార్జ్ ఎస్ఐ రజనీకాంత్ తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన ఎంబరి మహేష్‌కు చెందిన ట్రాక్టర్ ను, ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 9 న దొంగిలించుకు పోయారని ఎంబరి మహేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద బుధవారం ట్రాక్టర్ అమ్మకం గురించి చర్చిస్తుండగా పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నామని తెలిపారు. నిందితులు చాకలి రాజు, మందుల అరవింద్, తమ్మల రవి, విఠల్, మోహన్ గుట్టేను అదుపులో తీసుకున్నామని తెలిపారు. అనంతరం వారి వద్ద నుంచి ఒక ట్రాక్టర్, ట్రాలీ, ఒక బైక్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సందర్భంగా వాహనాల దొంగతనం గురించి వాహనదారులకు సూచిస్తూ తమ వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి







పురుషులు, మహిళల విభాగంలో

ముగ్గురు జాతీయ స్థాయికి ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 71వ మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టుకు చెందిన క్రీడాకారిని గోదావరి నేషనల్ టీం ప్రాబబుల్స్‌లో సెలక్షన్స్ అయినట్టు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి బుధవారం పేర్కొన్నారు. పురుషుల విభాగంకు సంబంధించి ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 71వ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షీప్‌లో చక్కని ప్రతిభ కనబరిచిన సుశాంత్, శ్రీనాథ్ సైతం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయి ప్రాబబుల్స్‌లో స్థానం పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరిగే నేషనల్ కోచింగ్ క్యాంపులో శిక్షణ తరగతుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపిక కావడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్రతినిధులు, వ్యాయమ ఉపాధ్యాయులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

బస్సు డీ కొట్టడంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో నిజామాబాద్ నుంచి బాన్సువాడకు వేగంగా వచ్చిన బస్సు గుర్తు తెలియని వ్యక్తిని (30) డీ కొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను అంబులెన్సు ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. ఎస్ఎన్ పురం పంచాయతీ సెక్రటరీ సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కందకుర్తి గోదావరిలో వ్యక్తిగల్లంతు

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో బుధవారం స్నానాలను ఆచరించడానికి విచ్చేసిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గల్లంతయినట్లు రెంజల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. కోటగిరి మండలానికి చెందిన మక్కయ్య, సాయిబాబా (35)లు త్రివేణి సంగమానికి వచ్చారు. స్నానం చేస్తుండగా మక్కయ్య గోదావరి నుండి బయటకు రాగా, సాయిబాబా గోదావరిలోని గల్లంతయినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలను చేపట్టి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన నాగం నగేష్ (36) మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో తన ఇంట్లో ఫ్యానుకూ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు రెంజల్ పోలీసులు తెలిపారు. భార్య శాలిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉందన్నారు.

ప్రమాద స్థలాలను పరిశీలించిన ట్రాఫిక్ ఏసిపి నారాయణ

నవ తెలంగాణ-జక్రాన్ పల్లి

మండలంలోని పడకల్ తండా వద్ద ప్రమాద స్థలాలను ట్రాఫిక్ ఏసిపి నారాయణ బుధవారం పరిశీలించారు. ఇటీవల పడకల్ తండా వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో ఇద్దరు మరణించగా ఇద్దరికీ తీవ్ర గాయాలు అవడంతో ప్రమాద స్థలాలను పరిశీలించి జాతీయ రహదారి అధికారులకు ఎస్ఐ తిరుపతికి పలు సూచనలను ఇచ్చారు.

కార్యకర్తలను పక్కదారి పట్టిస్తున్నరు..



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వెలగపూడి గోపాల్

నవతెలంగాణ-వర్ని

బాన్స్ వాడ నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత అయిన శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డిపై ఏనుగు రవీందర్ రెడ్డి గ్రూప్ కార్యకర్త యలమంచిలి లేనిపోని అబద్దాలు చెప్పుతూ కార్యకర్తలను పక్క దారి పట్టిస్తున్నారని మాజీ ఏ ఎం సి వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయం లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒకే పార్టీ లో ఉంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను తంగలో తొక్కుతున్నారని, ఇలాంటి రాజకీయంతో ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యలమంచిలి శ్రీనివాస్ రావు రాజకీయం పేరుతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని విమర్శించారు. శాసనసభ్యునిపై అబద్దాల చెపుతు పార్టీ సంక్షేమాలకు అడ్డుపడుతున్నారని అన్నారు. మంగళవారం మోస్రాలో యలమంచిలి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం పార్టీని అవమానం పరిచినట్లే అని అన్నారు. ఖబర్దార్ ఏనుగు, యలమంచిలి అని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యాదగిరి సంస్మరణ సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్/కమ్మర్‌పల్లి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆదర్శ కమ్యూనిస్టు విప్లవకారుడు కర్నాటి యాదగిరి విప్లవ జోహార్లు అర్పిస్తూ ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగే సంతాప సభను విజయవంతం చేయాలని సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ.. ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచి త్యాగాల బాటలో నడిచిన యాదగిరి అన్న ఆదర్శం కమ్యూనిస్టు బాటలో మనమందరం నడవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు మచ్చర్ల రాజన్న, పద్మ, అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఆదర్శ కమ్యూనిస్టు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరి సంతాప సభ గోడప్రతులను మండల పార్టీ కార్యదర్శి బి.అశోక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లోని కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి కామ్రేడ్ యాదగిరి సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు గంగారం, రాజన్న, గంగు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి జాతర

కమ్మర్‌పల్లిలో అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్ర శివారులోని శ్రీగిరి క్షేత్రం గుట్టపై గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గుట్టపై ఉన్న బ్రహ్మంగారి అలయంలో వేద పండితుల మంత్రోచ్చరణలమధ్య వీర బ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అంతకు ముందు గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి అలయం నుండి బ్రహ్మంగారి అలయం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మంగారిని దర్శించుకొని సరస్వతి, శివాలయాల్లో పూజలు చేశారు. జాతరతో శ్రీగిరి క్షేత్రం కోలహలంగా మారింది. ఈ సందర్భంగా స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. జాతర సందర్భంగా గుట్టపై తినుబండరాల దుకాణాలు, చిన్నారుల కోసం బొమ్మల దుకాణాలు వెలిశాయి. రాత్రికి గ్రామంలోని నరసింహ స్వామి ఆలయం నుండి శ్రీగిరి గుట్ట వరకు రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతర పురస్కరించుకొని ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోగ రామస్వామి, కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో ఘనంగా రథోత్సవం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లిలో బుధవారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం లోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. క్యాంప్ కార్యాలయం లో పలువురు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించి స్వీట్లు పంచి పెట్టారు. ముందస్తుగా నిర్ణయించిన విధంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పలు మండలాల్లో పర్యటించి అక్కడి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమం లో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారా చంద్ నాయక్, దర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాతీయ కార్యవర్గ సభ్యులు ఇమ్మడి గోపి ముదిరాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, అమృత పూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, పోలసని శ్రీనివాస్, సొసైటి చైర్మన్లు రామచందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, డిసిసి డెలిగేట్ టిజసుధాకర్, బోర్వెల్ రాజేందర్ రెడ్డి, ఎల్‌బిసి గంగాధర్, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి లచ్చమోల్ల దత్తాద్రి, సీనియర్ నాయకులు ఉమ్మజి నరేష్, మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఖాజా మియా, అహ్మద్ హుస్సేన్,మలంగ్, సద్దం, డాక్టర్ సామల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి :ఎమ్మెల్యేకు బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



డిచ్‌పల్లి :ఎమ్మెల్యేకు బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి

జక్రాన్‌పల్లి: లాభాపేక్ష లేని వ్యక్తి ఎమ్మెల్యే భూపతిరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లాభాపేక్ష లేనివారని, . డాక్టర్ వత్తిని వదులుకొని సేవచేసేందుకు రాజకీయ రంగంలోకి వచ్చారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వినోద్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : కేక్ కట్‌చేస్తున్న నాయకులు

తొర్లికొండలో..

మండలంలోని తొర్లికొండ గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి 61వ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్టు ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి తెలిపారు. కేక్ కట్ చేసి అందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి మాట్లాడు ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఏఎంసిలో...

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి 61వ జన్మదిన వేడుకలను శ్రద్దానంద్ గంజ్ లో గల శివాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వచ్చిన మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిజామాబాద్ ఏఎంసి వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, దడ్వాయి సంగం సభ్యులు, హమాలీ సంఘం సభ్యులు, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



నిజామాబాద్‌సిటీ: ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మోపాల్‌లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సాయి రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో మన నియోజకవర్గ అభివృద్ధి దాత డాక్టర్ భూపతిరెడ్డి ఉన్నత పదవులు పొందాలని మండల అధ్యక్షులు అన్నారు కార్యక్రమంలో మోపాల్, బాడ్సి సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, నిమ్మల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిపైకెక్కిన అభిమానం

రూరల్ ఎమ్మెల్యేకు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంగ్రెస్ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు అనుపల కిరణ్ ఎమ్మెల్యేపై అభిమానంతో ఇంటి స్లాబ్ పై ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రాన్ని వేయించారు.

